
కథ

# మనిషి యంత్రం

## పెయ్యేటి శ్రీదేవి



**మం**చి భర్తన్నా దొరుకుతాడేమో కాని, ఈరోజుల్లో పనిమనిషి దొరకడం మాత్రం దుర్లభం ఈరోజుల్లో. అంట్లు, బట్టలు, ఊడ్పులకే నాలుగొందలు అడుగుతున్నారు. ఇంకా మిగతా పన్లన్నింటికైతే ఆరొందలకు తక్కువ తీసుకోరు. ఇప్పటి రోజుల్లో ఎన్ని సౌకర్యాలున్నా ఇంటి పన్లు చేసుకోవడం కష్టమైపోతోంది.

భర్తకు, పిల్లలకి నిమిషాల్లో అన్నీ అమర్చిపెట్టాలి. ఇంకా ఇల్లాలు ఉద్యోగస్తురాలైతే ఆమె యంత్రంలా పని చేయాలి. పని మనిషి రాకపోతే ఆమె పడే పాట్లు చెప్పలేం. నడుం పడిపోతుంది. ఇంటి పనితో దాదాపు ప్రతి ఇల్లాలూ సతమతమౌతుంది.

ఆరోజు పనిమనిషి రాకపోవడంతో సుమిత్ర ఒళ్ళు హూనం అయ్యింది. అన్ని పన్లు చక్కబెట్టి వంట పూర్తయ్యేసరికి పన్నెండయ్యింది. సుమిత్రకి డబ్బుకు లోటు లేదు. ఏ వస్తువు ఎంత ఖరీదైనది కొన్నా భర్త ఏమీ అనడు. టీవీలో పన్నెండు గంటలకు వచ్చే టెలీ షాపింగ్‌లో చూసింది అంట్లు తోమే మిషన్‌ను. సుమిత్రకు ఆ డిష్ వాషర్ బాగా నచ్చింది. వెంటనే వాళ్ళిచ్చిన నెంబర్‌కి ఫోన్ చేసి దాన్ని తెప్పించింది. ఇంట్లో ఎవ్వరూ పెరుగు వేసుకోరు. మీగడ తరకలు రాకుండా చిక్కని మజ్జిగ నడకట్టి పోయాలి. కవ్వంతో చిలికినా గరాటులో వడగట్టి, అవి సరిగ్గా దిగక నానా అవస్థ పడుతోంది. అందుకని మజ్జిగ చేసే యంత్రం కూడా తెప్పించింది. వెట్ గ్రైండర్, వాక్యూమ్ క్లీనర్ కొన్నది. మిక్సీ, జ్యూసర్ ఎలాగూ వున్నాయి. అన్నం వండే ఎలక్ట్రిక్ కుక్కర్, అతిథులొస్తే క్షణాల్లో కాఫీ చేసే ఫిల్టర్ అన్నీ తెప్పించింది. ఇల్లంతా యంత్రాలతో నిండిపోయి కార్ఖానాలా తయారైంది. పనిమనిషిని మాన్పించింది.

ఇప్పుడు ఇంట్లోవాళ్ళకి, వచ్చిన అతిథులకి కాఫీ, టిఫిన్లు అందివ్వడం, భోజనాలు ఏర్పాటు... ఇలా అన్ని నిమిషాల్లో జరిగిపోతున్నాయి వేరే మనిషి సాయం లేకుండా. ఇంటికి వచ్చే బంధువులు, స్నేహితులు ఎక్కువైపోయారు. వచ్చిన వాళ్ళందరికీ

అతిథి మర్యాదలు చేసి, తను కొన్న యంత్రాలను ఏది, ఎందుకు, ఎలా ఉపయోగపడుతుందో, ఎలా పని చేస్తుందో అందరికీ వివరించి చెబుతోంది. యంత్రాలతో ఇల్లంతా ఇరుకైపోయింది.

ఇలా రోజల్లా చేసే పని యంత్రాల సాయంతో నిమిషాల్లో చేసేస్తోంది సుమిత్ర. ఇప్పుడు యంత్రాలను పని చేయించే యంత్రంగా మారింది తను. ఇల్లంతా వాటి హోరుతో ఒకళ్ళమాట ఒకళ్ళకి వినిపించక గట్టిగా అరుచుకోవడం మొదలెట్టారు. నడవడానికి, కూర్చోవడానికి జాగా లేక పిల్లలు నానా అవస్థ పడుతున్నారు. ఇది చాలదన్నట్టు కరెంటు పోతే పని ఆగిపోకుండా జనరేటరు కూడా తోడైంది ఇప్పుడు. "సుమిత్రా! ఈ యంత్రాలవల్ల ఇల్లు మరీ ఇరుకైనట్టుంది. ఇదివరకే బాగుండేమో!" అన్నాడు భర్త.

*** *** ***

సుమిత్ర మిక్సీ వేసింది. కాలింగ్ బెల్ మోగుతున్నా వినపడ్డంలేదు. మిక్సీమోత ఆగిపోయాక కాలింగ్ బెల్ మోత వినిపించేసరికి సుమిత్ర కంగారుగా తలుపు తీసింది. హాయ్! లతా! ఇదేనా రావడం! వాట్ ఎ సర్ప్రయిజ్. రా! రా! ఆహ్వానించింది సుమిత్ర తన చిరకాల మిత్రురాలిని.

"ఇదే తల్లీ 'నా' రావడం! కాని వచ్చి ఎంత సేపు కాలింగ్‌బెల్ మోగిస్తున్నా తలుపు తీయవాయె! అంతచేటు ఏం చేస్తున్నావ్?"

"మిక్సీ వేశాను. దాని పనితనం పెరిగిందిలే! చావాల్సయింది కొని. ఆన్ చేస్తే ఒకటే రొద. బాగు చేయిద్దామంటే బద్దకం. అందుకే కాలింగ్ బెల్ కూడా విన్పించలేదు" సంజాయిషీ ఇచ్చుకున్నట్టుగా చెప్పింది సుమిత్ర.

"సర్లే మీ పిల్లలు కనిపించరేం? మీ శ్రీవారేరి?" అడిగింది లత.

"కుశల ప్రశ్నలు తర్వాత కానీ ముందు వెళ్ళి ముఖం కడుక్కుని రా! కాఫీ చేస్తాను! కొంచెం రిలాక్సవుదువు గాని" అని టవలందిస్తూ సుమిత్ర వడివడిగా వంటింట్లోకి నడిచింది.

లత, సుమిత్రల స్నేహం చిన్ననాటిది. పెళ్ళిళ్ళయ్యాక వేర్వేరు ఊళ్ళలో స్థిరపడినా లత ఆఫీసు పని మీద ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా సుమిత్రను కలవకుండా వెళ్ళదు. తనో బ్యాంకాఫీసరు. స్కూల్లో, కాలేజీలో ఇద్దరూ ఎంతో స్నేహంగా, చెట్టపట్టాలేసుకుని తిరిగేవారు. వారికి జంట కవులని నిక్‌నేమ్ పెట్టి ఆనందించేవారు మిగతా స్నేహితులు.

ముఖం కడుక్కుని, సోఫాలో రిలాక్స్‌డ్‌గా వాలిపోయింది లత. ఎదురుగా టీవీలో దలేర్ మెహందీ పాట ఒకటి వస్తోంది. వేడి కాఫీ కలుపుకుని వచ్చి ఎయిరిండియా మహారాజా స్టయిల్లో, ఇదిగోండి కాఫీ! స్వీకరించుము! అని ముందుకు పెట్టి నిల్చుంది. సుమిత్ర కాఫీ ఆఫర్ చేసిన తీరుకి నవ్వొచ్చింది లతకి.

"ఇంకా అప్పటి చిలిపితనం పోలేదు. గుడ్!" అంటూ కాఫీ అందుకుని సిప్ చేస్తోంది లత.

"రెండ్రోజుల పాటు ట్రయినింగ్ ప్రోగ్రాం వుంటే వచ్చాను. ఇవాల్టితో పూర్తయింది. నిన్న సాయంత్రమే వద్దామనుకున్నాను గాని వర్షం. వర్షాన్ని తిట్టుకున్నాను గాని రావడానికి ధైర్యం చేయబుద్ధికాలేదు. వెళ్ళేలోగా కలుద్దామనుకున్నాను. వచ్చాను." అంది లత.

"ఇంకా అప్పటిలానే వున్నావ్ పేరును సార్థకం చేస్తూ! నిన్ను చూస్తేకొంచెం జలసీగా వుంది" అంది సుమిత్ర లత వంక చూస్తూ.

"ఒంటి తీరు కావొచ్చు' అంది లత.

"నన్నసలు చూడగానే గుర్తుపట్టావా? నాలుగు నెలల్లోనే నా వెయిట్ పెరిగింది" అంది సుమిత్ర.

"ఏం వెయిటే! పెరిగింది పరపతా? పలుకుబడా! బరువా?" జోక్ చేసింది లత.

"అవునే నీ ఇల్లంతా ఏమిటే? ఏదో షోకేసులో పెట్టినట్టు ఏమిటివన్నీ? అడిగింది లత".

"అవన్నీ నేను సుఖపడడానికి కొన్న యంత్రాలు. ఇవేమో నేను లావు తగ్గడానికి కొన్న స్లిమ్మర్లు. ఇది కొవ్వు తగ్గడానికి. ఇది పొట్ట తగ్గడానికి.. పరిచయం చేస్తూ చెబుతోంది సుమిత్ర".

"లావెందుకయ్యావే అసలు! తిండి ఎక్కువయ్యే కాదు. అన్ని పనులు మిషన్లే చేస్తున్నాయి. నీవు కేవలం ఆ మిషన్లను ఆపరేట్ చేస్తున్నావంతే. యంత్రాలవల్ల సుఖపడొచ్చు కాని అసలు శారీరక శ్రమ లేకపోతే నీ శరీరంలో జమయ్యే కేలరీలు ఎలా ఖర్చవుతాయి చెప్పు? రోజూ ఉదయం సాయంత్రం రెండు గంటలు వాకింగ్ చేయవే. నీ పనులు నీవే చేసుకో. లావుగా వున్నావని అలా బాధపడడం దేనికి? యంత్రాలతో పనిచేయించవచ్చు. ఆరోగ్యం కోసం మనిషి అప్పుడప్పుడూ యంత్రంగా మారితే తప్పలేదే! మాఇంట్లో ఇంటి పన్లు దాదాపు అన్నీ నేనే చేస్తాను. కొన్నింటిలో మా శ్రీవారు సాయపడతారు. ఇద్దరం ఆఫీసుకెళ్ళినా ఇబ్బందే లేదు".

"మావారూ సాయపడతారే! నేనే ఆయన్ని పని అంటుకోనివ్వను. నాకు ఒకరు చేస్తే నచ్చదు. నా కుటుంబం ఎవ్వరికీ లేదన్న ఇన్హిబిషన్ కావొచ్చు. నా ఆధ్వర్యంలో జరిగితే తప్ప సంతృప్తి వుండదు. అందుకనే నేను ఇన్ని యంత్రాలు కొన్నా మావారేం మాట్లాడలేదు. కాని నాకూ ఇప్పుడు తెలుస్తోంది వీటి దుష్ప్రభావం! కరెంటు కూడా విపరీతంగా కాలుతోంది. ఇంటి బరువు తగ్గినా ఒంటి బరువు పెరిగిపోతోంది. ఎప్పుడో చేయలేని పరిస్థితి వస్తే తప్ప ఇక వాటికి పని అప్పజెప్పను. మా వారి సహకారం కూడా తీసుకుంటానిక. అంతా నేనే.. అన్నీ నేనే .. అన్నట్టు చేయనిక. కళ్ళు తెరిపించావే. అసలు నీవు నాకు జ్ఞాన బోధ చేయడానికే వచ్చావులావుంది" అన్నది సుమిత్ర.

"సరే సరే! నా ట్రయిన్ టైమవుతోంది. మిమ్మల్ని, ముఖ్యంగా నిన్ను చూద్దామని వచ్చాను. పనయిపోయింది. ఇక వెడతాను" అంటూ లేచింది సుమిత్ర.

"అప్పుడేనా వెళ్ళడం? రావడం! వెళ్ళడం అంతా నీ ఇష్టమేనా? కుదరదు. కనీసం ఈరాత్రయినా వుండాల్సిందే" పట్టుబట్టింది సుమిత్ర.

"కుదరదే! టికెట్ రిజర్వ్ చేయించాను. అయినా రేపు ఆఫీసులో విధిగా హాజరు కావాలి. రేపు రీజియనల్ మేనేజర్ వస్తున్నాడు. వెళ్ళాలి. ఈసారి వచ్చినప్పుడు వుంటాలే! ఇప్పటికి వదులు! మీ పిల్లలకు, నా బెస్ట్ విషెస్. మీ వారిని అడిగానని చెప్పు. ఈసారి మేమిద్దరం వస్తాంలే!" అంటూ బేగ్ భుజానికి తగిలించుకుంది లత. వీధి మలుపు తిరిగే వరకూ చేయి వూపుతూనే వుంది మధ్య మధ్యలో వెనక్కితిరిగి చూస్తూ.

## యాక్షన్ చిత్రాల అర్జున్

తన కెరీర్ మొదట్లో 'మా పల్లెలో గోపాలుడు' లాంటి సెంటిమెంట్, స్టోరీ చిత్రాలు చేసినా తరువాత తరువాత అర్జున్ పరిశ్రమలో నిలదొక్కుకున్నదీ, రాణిస్తున్నదీ యాక్షన్ చిత్రాలలోనే. అంతేకాకుండా అటు తమిళంలోనూ, ఇటు తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ ఉండటంతో ఇంగ్లీషు సినిమాలను పోలిన తన సినిమాలలో రెండుచోట్లా రఫ్ ఆడించేస్తున్నాడు హీరో అర్జున్.

